సాక్షి సంగారెడ్డి

సోమవారం । 26 । మే । 2025



పోచారం.. వన విజ్ఞానం

అడవులపై అవగాహన కల్పించేందుకు విద్యార్థుల కోసం వన విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. వివరాలు 8లో ▸



నకిలీ విత్తనాలపై నజర్

దుబ్బాకటౌన్, చిన్న కోడూరుల్లో వ్యవసాయాధికారులు నకిలీ విత్తనాలపై దృష్టి పెట్టారు. వివరాలు 8లో ▸



ఎరువుల మోతాదు మించొద్దు

పత్తి పంట సాగులో మోతాదుకు మించి ఎరువులు వినియోగించవద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

గ్రామ పాలన పరీక్షకు 250 మంది హాజరు

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ క్రాంతి



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి. చిత్రంలో అదనపు కలెక్టర్

సంగారెడ్డి జోన్: గ్రామ పాలన పరీక్షకు 250మంది అభ్యర్థులు హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ తార డిగ్రీ కళాశాలలో గ్రామ పాలన అధికారి పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ మాధురితో కలసి ఆదివారం పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...గ్రామ పాలన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు. కారక్యక్రమంలో ఆర్డీఓ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేతకీలో కోటి జపయజ్ఞం



కేతకీలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): శ్రీ కేతకీ సంగమేశ్వరాలయంలో ఆలయ ఆవరణలో విశ్వ మానవ ధర్మ ప్రచారం పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం శివ మంత్ర కోటి జపయజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఆవరణలో 'దేశ రక్షణ–ధర్మ శిక్షణ'సంకల్పంతో యజ్ఞం, పూర్ణాహుతి, మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దత్తగిరి మహరాజ్ ఆశ్రమ పీఠాధిపతి గిరి మహరాజ్, ధనసిరి పీఠాధిపతి వీరేశ్వర శివాచార్య మహాస్వామి, రంజోల్ రాజయోగ ఆశ్రమ పీఠాధిపతి రాజయ్య స్వామి, కేతకీ ఆలయ పాలకమండలి చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, ఆలయ ఈఓ శివ రుద్రప్ప, మాజీ చైర్మన్ నీల వెంకటేశం, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలు ఎత్తివేస్తే ఉద్యమమే!

ప్రభుత్వానికి కేవీపీఎస్ హెచ్చరిక



నారాయణఖేడ్: మాట్లాడుతున్న కొఠారి నర్సింహులు

నారాయణఖేడ్: సాంఘిక సంక్షేమ గురుకులాల్లోని జూనియర్ కళాశాలల ఎత్తివేస్తే భారీ ఎత్తున ఉద్యమిస్తామని, ఆ తర్వాత జరిగిన పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని జిల్లా కేవీపీఎస్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఖేడ్‌లో ఆదివారం కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొఠారి నర్సింహులు, కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ..రాష్ట్రంలోని 11 జిల్లాల్లోని 12 సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇంటర్మీడియెట్ కళాశాలలను ఎత్తివేతకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. దీంతో పేద, దళిత, బీసీ విద్యార్థులకు తీవ్రం నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ అనాలోచిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘనాయకులు లాలప్ప, నాందేవ్, వినోద్ పాల్గొన్నారు.

సంగారెడ్డిలో 26 నుంచి అంతర్జాతీయ సదస్సు

అమీర్‌పేట(హైదరాబాద్): యువతలో దేశ సాంప్రదాయ సంగీతం, సంస్కృతిని ప్రోత్సహించేందుకు సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అమంగిస్ట్ యూత్ (స్పిక్ మైకే)సంస్థ 10వ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తోంది. అమీర్‌పేట మ్యారీ గోల్డ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ వ్యవస్థాపకుడు,పద్మశ్రీ డా.కిరణ్ సేట్ వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఈ నెల 26 నుంచి జూన్ 1వరకు ఏడు రోజులపాటు జరిగే సదస్సులో దేశ, విదేశాలకు చెందిన 1,400 మంది విద్యార్థులు,100 మంది వలంటీర్లు పాల్గొంటారని తెలిపారు. సంగీత విద్వాంసులతో పరిచయాలు, హస్తకళల సదస్సులు ఉంటాయన్నారు.

సర్వేయర్ల శిక్షణకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 50 రోజులపాటు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ట్రైనింగ్
- సమాఖ్య భవనంలో ప్రారంభించనున్న కలెక్టర్ క్రాంతి
- జిల్లాలో 166మంది ఎంపిక

సంగారెడ్డి జోన్: ప్రభుత్వ సర్వేయర్ల కొరత దృష్ట్యా లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి అనే నిబంధన ఉండటంతో రాష్ట్రంలోని భూములన్నీ సర్వే చేసి మ్యాప్‌లు రూపొందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సరిపడా సిబ్బంది లేని నేపథ్యంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లతో భూ సర్వే చేయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులోభాగంగానే లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఎంపిక చేసింది. ఈనెల 17వ తేదీ వరకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల కోసం మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం జిల్లాలో 166మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను అధికారులు ఎంపిక చేశారు. వీరికి ఈనెల 26నుంచి 50రోజులపాటు శిక్షణనివ్వనున్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ భవనంలో ప్రధానంగా థియరీ, టిప్పన్ ప్లాటింగ్, ఫీల్డ్ అంశాలను లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అధికారులు బోధించనున్నారు. ఎంపికైన వారి వివరాలను అధికారులు ఇప్పటికే విడుదల చేశారు. శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి జిల్లా సమాఖ్య భవనంలో ప్రారంభించనున్నారు. శిక్షణ అనంతరం 42 రోజులపాటు క్షేత్రస్థాయిలో, సర్వేయర్ కింద శిక్షణనివ్వనున్నారు. అందులో విజయవంతంగా శిక్షణ పూర్తిచేసిన వారికి రాష్ట్రస్థాయిలో పరీక్ష నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ కోసం ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. జిల్లాలో ఎంపికైన 166 మందికి సోమవారం నుంచి శిక్షణ ఉంటుంది. శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ క్రాంతి ప్రారంభిస్తారు.

ఐనేష్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, సంగారెడ్డి



భూములకు పట్టాలివ్వండి

భూ సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భారతి చట్టం అమలులో క్షేత్రస్థాయిలో రైతుల నుంచి భారీ ఎత్తున ప్రభుత్వానికి దరఖాస్తులు అందుతున్నాయి. ప్రభుత్వానికి వచ్చిన విజ్ఞప్తుల్లో తమ భూములకు పట్టాలివ్వాలని వచ్చిన వినతులే అత్యధికంగా ఉన్నాయి.



- భూ భారతి పైలెట్ ప్రాజెక్టులో భారీగా దరఖాస్తులు
- ఇక క్షేత్రస్థాయి పరిశీలనకు శ్రీకారం
- డీటీలతో 12 అధికారుల బృందాల నియామకం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ''ప్రభుత్వ భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్నాము. వాటికి పట్టాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాము. ఇప్పుడు ఆ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయండి..''అంటూ పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి చట్టంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద కొండాపూర్‌ను ఎంపిక చేసిన విషయం విదితమే. ఈ ప్రాజెక్టులోభాగంగా ఈనెల 5 తేదీ నుంచి మండలంలోని భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వినతిపత్రాలు తీసుకున్నారు. ఈ దరఖాస్తుల్లో ఎక్కువగా ఈ ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలని కోరుతూ వచ్చిన దరఖాస్తులే అధికంగా ఉన్నాయని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఐదు గుంటలు..పది గుంటలు.. ఎకరం..రెండు ఎకరాలు..ఇలా తమ భూములకు పట్టాలు ఇవ్వాలనే దరఖాస్తులు రావడం గమనార్హం. వీటితోపాటు తమ భూముల విస్తీర్ణం తక్కువగా రికార్డుల్లో ఉందని, వాటిని సరి చేయాలని కూడా రైతులు ఎక్కువగా దరఖాస్తులు చేసుకున్నారు. పౌతి కోసం కూడా వినతులు వచ్చాయి. సర్వే నంబర్‌లో పడిన తప్పులు సరిచేయాలని రైతులు అధికారులకు ఇచ్చిన దరఖాస్తుల్లో పేర్కొన్నారు. అన్ని రకాల దరఖాస్తులు కలిపి ఈ పక్షం రోజుల్లో 1,718 దరఖాస్తులు వచ్చాయని మండల రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

ప్రతీ రెండు గ్రామాలకో అధికారుల బృందం

కొండాపూర్ మండలంలో మొత్తం 23 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టారు. ఆయా గ్రామాలకు వెళ్లి ఈ దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నారు. అలాగే ఈ భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించనున్నారు. ఇందుకోసం 12 బృందాలను నియమించారు. ప్రతి రెండు గ్రామాలకు ఒక బృందం ఈ దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టారు. ఇందుకోసం 12 మంది చొప్పున డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లను నియమించారు. జిల్లాలో ఉన్న రెవెన్యూ యంత్రాంగంలో దాదాపు సగంమంది డీటీలు, ఆర్ఐలు, ఇతర సిబ్బంది ఈ పైలెట్ ప్రాజెక్టుపైనే పనిచేస్తున్నారు. ఈ బృందాలు ఇకపై ప్రతీ గ్రామానికి వెళ్లి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టనున్నారు.

మంత్రుల సందర్శన..

భూభారతి పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న కొండాపూర్ మండలాన్ని ఇటీవల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించిన సంగతి తెలిసిందే. జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు, పొంగులేటి, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్ వల్లూరు క్రాంతి తదితరులు అక్కడ జరిగిన రైతు సదస్సులో పాల్గొన్నారు. వచ్చిన దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియను చేపట్టామని, రికార్డులను వెరిఫికేషన్ చేసుకుని దరఖాస్తులను పరిష్కరిస్తామని మండల రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.

ముమ్మరంగా సాగు పనులు

ఓవైపు దుక్కులు.. మరోవైపు విత్తన సాగు

- పొలం బాట పట్టిన రైతన్నలు
- ముందస్తు వర్షాలతో పలువురు ఆందోళన

సంగారెడ్డి జోన్: జిల్లాలో కొన్ని రోజులుగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు వానకాలంలో పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. రోహిణి కార్తె ప్రారంభం కావడంతోనే పలుచోట్ల విత్తనాలు విత్తుకోవటం సైతం ప్రారంభించారు. వర్షాలు కురవడంతో సాగుకు అనుకూలంగా మారడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పత్తి విత్తనాలు విత్తుకుంటున్న రైతులు

విత్తనాలు వేసేందుకు అచ్చు కట్టడం, గత సీజన్లో సాగు చేసిన పత్తి కట్టెతోపాటు వ్యర్థాలను తొలగించడంతో పాటు తదితర పనులు చేసుకుంటూ సిద్ధమవుతున్నారు. ఇక వర్షాలు కురవడం, ముందస్తుగానే రుతుపవనాలు వస్తాయనే సమాచారంతో రోహిణి కార్తె ప్రారంభంతోనే జిల్లాలోని పలు గ్రామాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తుకోవడం ప్రారంభించారు. ఆదివారం పలుచోట్ల కూలీల సహాయంతో కొందరు, ఎడ్ల సహాయంతో నాగలి పట్టి మరికొందరు విత్తనాలు వేయడం కనిపించింది. మరో వారంరోజుల్లో రైతులందరూ విత్తనాలు చల్లడం ప్రారంభిస్తే కూలీలు దొరకని పరిస్థితి ఏర్పడే అవకాశముండటంతో ముందుగానే విత్తనాలు వేసుకుంటున్నామని రైతులు చెబుతున్నారు.

జిల్లాలో అత్యధికంగా పత్తి సాగు

పత్తి పంటను జిల్లాలో అత్యధికంగా సాగు చేసే అవకాశముందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఎనిమిది లక్షలు ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు చేసే అవకాశం ఉండగా ప్రధానంగా పత్తి పంటను 3.80 లక్షల ఎకరాలకు పైగా సాగు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. రెండో ప్రధాన పంటగా వరి పంట 1.65లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశముంది.

విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లు

జూన్ తొలి వారంలోనే అన్ని రకాల పంటలను సాగు చేసే అవకాశం ఉంది. మరో వారం రోజులే మిగిలి ఉండటంతో విత్తనాలతో పాటు ఎరువులను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పెట్టుబడుల ఖర్చులకుగాను బ్యాంకులలో రుణాలు తీసుకోవడం తోపాటు ఇతరుల వద్ద అప్పుగా తీసుకుంటున్నారు. దీంతో మరో వారం రోజుల్లో రైతన్నలు పొలం బాటపట్టి మరింత బిజీ బిజీగా కనిపించనున్నారు.

ఆందోళనలో కొంతమంది రైతులు

కురుస్తున్న వర్షాలతో దుక్కులు పూర్తి కాకపోవడంతో పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ అకాల వర్షాలతో పలు చోట్ల దుక్కులు దున్నేందుకు వీలు కావడం లేదని రైతులు చెబుతున్నారు.



కొల్లూర్ గ్రామ శివారులో పత్తి విత్తనాలు వేస్తున్న రైతు కూలీలు

అణగారిన వర్గాల పాలిట మహనీయుడు

- అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ సభలో ఎమ్మెల్యే



నారాయణఖేడ్: విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డ మహోన్నత వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కొనియాడారు. మనూరు మండలం బోరంచ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ...అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం, రిజర్వేషన్ల వల్ల బడుగువర్గాల జీవితాల్లో వెలుగు నింపారని గుర్తు చేశారు. అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అమ్మాయిలకు డిగ్రీ వరకు విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు వారికి వివాహాలు చేయకూడదని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ మక్సూద్, దుర్గాప్రసాద్, సంగన్న, గుండుపాటిల్, గుప్రప్ప మశ్చందర్, మారుతి, జైభీమ్ ఆర్మీ, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు త్వరలోనే నిధులు

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



రోడ్డు మరమ్మతుల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఇంద్రేశం–దౌల్తాబాద్ రహదారి పూర్తిస్థాయి మరమ్మతుల కోసం త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఇంద్రేశం చౌరస్తా వద్ద పూర్తిస్థాయిలో ధ్వంసమైన రహదారిని ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వర్షాకాలంలో వాహనాలు వెళ్లేందుకు...ప్రజలు నడిచేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తన దృష్టికి తీసుకురావడంతో సొంత నిధులతో ఇంద్రేశం చౌరస్తా వద్ద రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించామని తెలిపారు. ఇంద్రేశంతోపాటు రామేశ్వరంబండ, పెద్దకంజర్ల, చిన్న కంజర్ల, ఐనోలు, బచ్చుగూడెం, పోచారంతోపాటు నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఈ రహదారినే వినియోగిస్తారని తెలిపారు. తాత్కాలిక మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు కేటాయించగా..కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదని చెప్పారు.

దోపిడీ కేంద్రం మూసివేత

- మూసి వేసిన మనూరు జొన్నల కొనుగోలు కేంద్రం
- కొనుగోళ్లు నిలిపివేయాలని ఆదేశం

సాక్షి ఎఫెక్ట్

నారాయణఖేడ్: జొన్నల కొనుగోళ్లలో తరుగు పేర దోపిడీకి పాల్పడుతున్న మనూరులోని పీఏసీఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాన్ని అధికారులు మూసి వేశారు. 'సాక్షి'దినపత్రికలో 'ఆగని తరుగు దోపిడీ!'శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. రైతుల వద్ద తరుగు పేర బస్తాకు 3కిలోల చొప్పున అధికంగా తూకం వేయడమే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి జొన్నలు తెచ్చి రైతుల పేర ఈ కేంద్రంలో విక్రయించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆరోపణలపై ఇదివరకే ఖేడ్ ఆర్డీఓ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ తనిఖీ చేయగా అధికంగా తూకం వేసిన విషయాన్ని గుర్తించారు. కొన్ని బస్తాల్లో 3కిలోల వరకు అదనంగా తూకం వేయడంపట్ల అధికారులు ఆశ్చర్యపోయారు. రైతుల వద్ద దోపిడీకి పాల్పడటం పట్ల కేంద్రం నిర్వాహకుడు, సీఈవో జనార్దన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా సీఈవో పద్ధతి మార్చుకోకపోవడం లేదని 'సాక్షి'లో కథనం రావడతో జిల్లా అధికారులు స్పందించారు. ఆదివారం నుంచి కేంద్రాన్ని మూసివేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ శ్రీదేవి 'సాక్షి'కి తెలిపారు.



నారాయణఖేడ్: మూసివేసిన మనూరు జొన్నల కొనుగోలు కేంద్రం

చావు'రస్తాలు'

'పేట'బైపాస్ 'ప్రమాదాల చౌరస్తా'

- తరుచూ ప్రమాదాలు
- రోడ్డు దాటాలంటేనే వణుకుపుట్టిస్తున్న వాహనాలు
- ఇప్పటికే పదుల సంఖ్యలో మృతి
- పట్టించుకోని అధికారులు

సదాశివపేట పట్టణ పరిధిలోని ముంబై జాతీయరహదారి జాతీయ రహదారి 65పై ఉన్న చౌరస్తాలు నిత్యం ప్రమాదాలతో నెత్తురోడుతున్నాయి. అతివేగంగా వెళ్లే వాహనాలతో ఈ చౌరస్తాలు కాస్తా చావు రస్తాలుగా మారాయి. సదాశివపేట పట్టణ పరిధిలోని ముంబై జాతీయ రహదారి 65 బైపాస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది.



ప్రమాదకరంగా ఉన్న బైపాస్ రోడ్డును దాటుతున్న వాహనదారులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): దాదాపు తొమ్మిదేళ్ల క్రితం నిర్మించిన నాలుగు వరుసలుగా విస్తరించిన ముంబై జాతీయరహదారి 65పై వాహనాల రాకపోకలు భారీగా పెరిగిపోయాయి. మండలంలోని దాదాపు 20 గ్రామాల ప్రజలు సదాశివపేట మండలానికి వివిధ పనుల నిత్యం వందల సంఖ్యలో రాకపోకలను సాగిస్తుంటారు. సదాశివపేట రావాలంటే నిజాంపూర్, వెంకటాపూర్,వెల్టూర్,ముబారక్‌పూర్, కొల్కూర్,మాచిరెడ్డిపల్లి,పొట్టిపల్లి,ఎన్కేపల్లి తదితర గ్రామాల ప్రజలు పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డును దాటి రావాల్సి ఉంటుంది. దీంతో బైపాస్ నిజాంపూర్,ఎన్కేపల్లి చౌరస్తాలను దాటాలంటే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తోంది. ఈ ప్రాంతాల్లో వెహికిల్ అండర్ పాస్ నిర్మాణం లేకపోవడంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఏ వైపు నుంచి ఏ వాహనం ఎప్పుడొస్తుందో, ఎవరి ప్రాణాలను హరిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతాల్లో తరుచుగా ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు పోతుండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. దీంతో వారి కుటుంబాలు వీధినపడ్డాయి. మండలంలోని 20 గ్రామాల ప్రజలు మండలానికి నిత్యం వివిధ పనుల నిత్యం వస్తుండటంతో వారితో పెరుగుతున్న ట్రాఫిక్ ను నియంత్రించడం పోలీసులకు భారంగా మారుతోంది. ద్విచక్రవాహనదారులు, బాటసారులు అతివేగంతో వచ్చే భారీ వాహనాలను తప్పించుకుంటూ రోడ్డును దాటే క్రమంలో ప్రమాదానికి గురై మృతి చెందుతున్నారు. ఆయా ప్రాంతాల్లో వెహికిల్ అండర్ పాస్ నిర్మాణాలను చేపట్టాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

వెహికిల్ అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలి



సదాశివపేట పట్టణ పరిధిలో నిర్మించిన బైపాస్ రోడ్డుతో గ్రామాల ప్రజలకు ఇబ్బందిగా మారింది. సదాశివపేట పట్టణానికి మండలానికి చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం రాకపోకలను సాగిస్తుంటారు. తరుచుగా ఇక్కడ ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు తగిన చర్యలు తీసుకుని వెహికిల్ అండర్ పాస్ నిర్మాణాన్ని చేపట్టాలి.

– కుమార్ గౌడ్, మండల యువజన సంఘాల నాయకుడు

అధికారులు చర్యలు తీసుకోవాలి



సదాశివపేట పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. ఎన్కేపల్లి,నిజాంపూర్ చౌరస్తాల వద్ద రోడ్డును దాటేందుకు ప్రజలు,వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో తరుచుగా ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

– నాని, యువజన నాయకుడు సదాశివపేట

నిబంధనలు పట్టించుకోరా

- ఉపాధి పనులపై కేంద్రం బృందం నిలదీత



రాయికోడ్: ఈజీఎస్ పనులను తనిఖీ చేస్తున్న అధికారులు

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై నిబంధనల పట్టింపులేకుండా వ్యవహరించడమేమిటని కేంద్ర తనిఖీ బృందం పంచాయతీ రాజ్ శాఖ అధికారులను నిలదీశారు. దీంతో సంబంధిత అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లనమిలారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్వహించిన పనులను తనిఖీ చేసేందుకు ఆదివారం రాయికోడ్‌కు గ్రామీణాభివృద్ధి శాఖ జాతీయ అధికారులు సంజయ్‌కుమార్ తదితరులు వచ్చారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో నిర్మించిన టాయిలెట్స్, వంట గది, ప్రహరీలను, పలు మెటల్, ఫార్మేషన్ రోడ్లను పరిశీలించారు. ఎక్కడా నిబంధనలు పాటించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బృందం పర్యటిస్తుంటే రాష్ట్ర, జిల్లా అధికారులు పీఆర్‌డీఈ తదితరులు హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ రాష్ట్ర, జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ అధికారులు, ఎంపీడీఓ ఎంఎం షఫీ,ఏపీఓ రమేశ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్



మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని జాలపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం రెవెన్యూ సిబ్బంది పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం తహసీల్దార్ మధుసూదన్ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనవారు నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్‌కు విద్యార్థి ఎంపిక



విద్యార్థి షణ్ముఖను సన్మానించి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కపూర్‌నాయక్ తండా గ్రామానికి చెందిన భానోతు మంగ– రాజు దంపతుల కుమార్తె షణ్ముఖ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్‌కు ఎంపికైంది. ఆమె నంగునూర్ మండలంలోని గట్లమల్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ నెల 2,3,4వ తేదీల్లో జగిత్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో మంచి ప్రతిభ కనబరించింది. దీంతో 27వ తేదీన చండీఘర్‌లో జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో ఆడనుంది. ఓ మారుమూల గిరిజన తండాకు చెందిన షణ్ముఖ జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల తండావాసులు, కాంగ్రెస్ నాయకులు అజ్మీర అనిల్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే గట్లమల్యాల ఉన్నత పాఠశాల 1999–2000 సంవత్సరం బ్యాచ్ పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి ఆమెకు రూ.6వేల ఆర్థిక సాయం అందజేసి సన్మానించారు.

వ్యక్తి అదృశ్యం



లక్ష్మణ్

చేగుంట(తూప్రాన్): బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం... జైత్రం తండాకు చెందిన జాటోత్ లక్ష్మణ్ తన భార్య లక్ష్మితో కలిసి ఈనెల 20న శివ్వంపేట మండలం తులపల్లి తండాకు బంధువుల ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తూప్రాన్ నుంచి బస్సులో ఇంటికి వస్తుండగా మాసాయిపేట బస్సు స్టేషన్‌లో లక్ష్మణ్ బస్సు దిగి ఎంతకు రాలేదు. దీంతో భర్త ఆచూకీ కోసం భార్య వెతికినా ఫలితం కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పోతాన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం... పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన అరికెల బూదయ్య(57) జీఎంఆర్ హైవేస్ ఆధీనంలో ఉన్న జాతీయ రహదారిపై కూలీపనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 15న జీఎంఆర్ హైవేస్ పెట్రోలింగ్ వాహనం రామంతాపూర్ శివారులో చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వామి, బూదయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. బూదయ్యకు ఆర్వీఎం ఆస్పత్రిలో చికిత్స చేయించి శుక్రవారం ఇంటికి తీసుకొచ్చారు. శనివారం రాత్రి బూదయ్య మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పోచారం.. 'వన విజ్ఞానం'

- అడవులు, జంతువుల గురించి అవగాహన
- విజ్ఞాన కేంద్రంలో యానిమల్స్ బొమ్మల ప్రదర్శన
- విద్యార్థులకు ఫీడ్‌బ్యాక్ వాల్ స్క్రీన్ ద్వారా చైతన్యం



విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన జంతువుల బొమ్మలు

హవేళిఘణాపూర్(మెదక్): అడవులు అంతరించిపోకుండా మొక్కలు పెంచి అడవుల శాతం పెంచాలని చెబుతున్న అధికారులు భవిష్యత్ తరాల విద్యార్థులకు ఉపయోగపడేలా వన విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ విజ్ఞాన కేంద్రంలో అడవిలో ఉండే జంతువులు దుప్పి, సింహం, ఎలుగుబంటి, జింకలు తదితర జంతువుల బొమ్మలను ప్రదర్శనకు ఉంచారు. మెదక్‌కు 14కిలోమీటర్ల దూరంలో ఉన్న హవేళిఘణాపూర్ మండలం పోచారం అభయారణ్యం పక్కనే ఈ వన విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల క్రితం యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ఎస్ఐడీ) ఆధ్వర్యంలో రూ.56లక్షల వ్యయంతో 2021లో నిర్మించారు. ఈ కేంద్రం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇక్కడికి వచ్చిన ఒక్కో విద్యార్థి సందర్శించేందుకు రూ.10 చెల్లిస్తే విజ్ఞాన కేంద్రంను చూపిస్తారు. అందులో ఒక హాల్‌లో టీవీని ఉంచి జంతువుల బొమ్మలు, వాటి ఆహారం, ఏయే రకాల జంతువులు ఉంటాయి. దాన్ని పరిరక్షించేందుకు మన బాధ్యతేమిటి? వన సంరక్షణ వల్ల కలిగే లాభాల గురించి టీవీల్లో చూపించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు.



అటవీ సంపదపై అవగాహన

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను జూ పార్కులకు తీసుకెళ్లి చూపిస్తుంటారు. కానీ వాటి ఆహారం.. అవి ఏయే ప్రాంతాల్లో ఉంటాయి.. రకరకాల జంతువులు, పక్షులు, వేసవిలో వచ్చే పక్షుల గురించి కూడా ఈ ఫీడ్‌బ్యాక్ సెంటర్‌లో స్క్రీన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. వేసవిలో తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకెళ్లి వన విజ్ఞాన కేంద్రంను సందర్శించవచ్చు.

యూఎస్ఎస్ఐడీ బృందం సందర్శన

అడవుల వల్ల కలిగే ప్రయోజనాలు అనేకం ఉంటాయి. కానీ ఈతరం వారికి తెలిసినవి కొన్ని మాత్రమే ఉంటాయి. యూఎస్ఎస్ఐడీ బృందం పోచారం అభయారణ్యం సందర్శనకు వచ్చిన సమయంలో అడవుల్లో ఉండే గిరిజనులకు సహజంగా లభించే ఉపాధి, ఇతర ఉపయోగాల గురించి అడిగి తెలుసుకున్నారు.



పోచారం వన విజ్ఞాన కేంద్రం

భవిష్యత్ తరాలకు ఉపయోగం



ఈతరం విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యానికి ఆయుష్షునిచ్చే అడవి సంపద గురించి తెలుపడం ముఖ్య ఉద్దేశం. అడవుల్లో ఉండే జంతువులు, పక్షుల గురించి వన విజ్ఞాన కేంద్రంలో వివరిస్తాం. వాటిని సంరక్షించడం ద్వారా ఎలాంటి ఉపయోగాలుంటాయి.. ఏయే పక్షులు ఎలా అడవుల్లో జీవనం సాగిస్తాయనే దానిపై విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పిస్తాం.

– మనోజ్‌కుమార్, ఎఫ్ఆర్ఓ

అబ్దుల్ ఖాదర్‌ను విడుదల చేయండి

- హైకమిషన్ ఆఫ్ ఇండియాకు ఎంపీ రఘునందన్‌రావు వినతి
- 4 నెలలుగా మలేషియా జైలులోనే పోతారెడ్డిపేట వాసి



హై కమిషన్ ఆఫ్ ఇండియా కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక: బతుకుదెరువు కోసం మలేషియా వెళ్లి తప్పుడు కేసులో అరెస్టు అయి జైలులో ఉన్న దుబ్బాక నియోజకవర్గంలోని భూంపల్లి–అక్బర్‌పేట మండలం పోతారెడ్డిపేటకు చెందిన అబ్దుల్‌ఖాదర్‌ను విడుదల చేయించాలని ఆదివారం కౌలాలంపూర్‌లోని హై కమిషన్ ఆఫ్ ఇండియాకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. ఉపాధి కోసం 7 సంవత్సరాల క్రితం మలేషియాకు వెళ్లిన అబ్దుల్‌ఖాదర్ అక్కడ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం కంపెనీలో కొంత మంది వ్యక్తులతో గొడవ జరిగింది. దీంతో వ్యక్తిగత విభేదాల వల్ల ఆ కంపెనీ వారు అతడిపై తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేయించడంతో నాలుగు నెలలుగా జైలులో ఉన్నాడు. ఈ విషయాన్ని రెండు రోజుల క్రితం మలేషియా పర్యటనకు వెళ్లిన ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి అక్కడి తెలుగువాళ్లతో పాటు బాధిత కుటుంబీకులు తీసుకువచ్చారు. వెంటనే కౌలాలంపూర్‌లో ఉన్న హై కమిషన్ ఆఫ్ ఇండియాలో హై కమిషనర్ బీఎస్ రెడ్డిని కలిసి జరిగిన విషయంపై విన్నవించారు. తప్పుడు కేసులో అరెస్టు అయి జైలులో ఉన్న అబ్దుల్ ఖాదర్‌ను విడుదల చేయించి, స్వదేశానికి పంపించాలని ఎంపీ కోరడంతో పాటు వినతిపత్రం అందజేశారు.

మా తండ్రిని విడుదల చేసి ఇండియాకు పంపించండి: బాధితుడి కుమారులు

కాగా బతుకు దెరువు కోసం మలేషియాకు వెళ్లిన తమ తండ్రిని అరెస్టు చేయడం పట్ల పోతారెడ్డిపేటలోని అబ్దుల్ ఖాదర్ భార్యతో పాటు ముగ్గురు కుమారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ తండ్రిని విడుదల చేసి ఇండియాకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని బాధితుడి కుమారులు సల్మాన్, సోహైల్ భారత ప్రభుత్వాన్ని కోరారు.

రావమ్మా.. మహాలక్ష్మి



చిన్నారికి స్వాగతం పలుకుతున్న కుటుంబీకులు, బంధువులు

నర్సాపూర్: ఆ ఇంట్లో ఆడపిల్ల పుట్టడంతో కుటుంబ సభ్యులు సంబురపడ్డారు. చిన్నారితో సహా తల్లి తమ ఇంటికి రాగానే పూలు చల్లుతూ స్వాగతం పలికారు. వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన కరుణాకర్, స్పందన దంపతులకు 27 రోజుల కింద ఆడశిశువు జన్మించింది. ఇటీవల చిన్నారికి అమ్మమ్మ గారింట్లో తొట్టెల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆదివారం కరుణాకర్ నర్సాపూర్‌లోని తమ ఇంటికి తీసుకొని వచ్చాడు. కుటుంబ సభ్యులు తమ ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని సంతోషం వ్యక్తం చేస్తూ పూలు చల్లుతూ స్వాగతం పలికి సంబురాలు చేసుకున్నారు.

సీనియర్ మేట్ల సమస్యలు పరిష్కరించండి



జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

- గ్రామీణ ఉపాధి హామీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మెదక్ కలెక్టరేట్: సీనియర్ మేట్ల సేవలను గుర్తించి ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో నియమించాలని గ్రామీణ ఉపాధి హామీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో సీనియర్ మేట్ల జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల్లో నియమించి, ప్రత్యేక అలవెన్స్ కింద నెలకు రూ.10వేలు వేతనం చెల్లించాలన్నారు. జిల్లాలో అమలవుతున్న ఉపాధి హామీని గ్రామాల్లో విజయవంతంగా అమలు చేసే దానిలో సీనియర్ మేట్ల పాత్ర కీలకమైందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ కంటే సీనియర్ మేట్లు అనేక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇన్ని పనులు చేస్తున్నా వారికి ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందడం లేదన్నారు. ఎండీఓ ఆఫీసులో ప్రత్యేక మీటింగ్‌లుంటే సొంత చార్జీలతో వెళ్లి వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాన్ని నమ్ముకొని చాలామంది సీనియర్ మేట్లు హరితహారం మొక్కలను సంరక్షించే పనిని ఉచితంగా చేస్తున్నారని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో కలిసిన గ్రామాలన్నింటికీ ప్రత్యేక ఉపాధి పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే.మల్లేశంతో పాటు సీనియర్ మేట్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆటోలు ఢీ..

పలువురికి స్వల్ప గాయాలు

అల్లాదుర్గం(మెదక్): రెండు ఆటోలు ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన అల్లాదుర్గం మండలం చిల్వెర గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చిల్వెర గ్రామ ఐబీ చౌరస్తా నుంచి బోడ్మట్‌పల్లి వైపు వస్తున్న ఆటోను మరో ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలుడితో పాటు మరో నలుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. గాయపడ్డ క్షతగాత్రులను అంబులెన్సులో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.



ప్రమాదంలో గాయపడ్డ బాలుడు

స్విమ్మింగ్‌లో సిద్దిపేట స్విమ్మర్స్ ప్రతిభ



పోటీల్లో స్విమ్మింగ్ చేస్తున్న క్రీడాకారులు

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్ర స్థాయి 10వ స్విమ్మింగ్ ఛాంపియన్ 2025లో సిద్దిపేట స్విమ్మర్స్ ప్రతిభ కనబర్చారు. ఆదివారం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన పోటీల్లో సిద్దిపేట క్రీడాకారులు శ్రీహర్ష ప్రియా, భారతి ప్రతిభ చూపారు. 50 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో శ్రీహర్ష, 50మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగంలో భారతి మూడవ స్థానంలో నిలిచారు. వీరికి రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీహర్ష, భారతికి బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నకిలీ విత్తనాలపై నజర్

విత్తన ఎంపికే కీలకం

- రైతులు నకిలీ విత్తనాలు కొనొద్దు..
- ఆఫర్లు చూసి మోసపోవద్దు
- ఎరువులు, విత్తన విక్రయాలపై నిఘా
- ఏఈఓల ద్వారా గ్రామాల్లో అవగాహన
- అన్నదాతలకు వ్యవసాయ అధికారుల సూచనలు



విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

దుబ్బాకటౌన్/చిన్నకోదూరు(సిద్దిపేట): రైతన్నలు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఆరుగాలం శ్రమకు ఫలితం దక్కాలంటే రైతన్న వేసే పంట విషయంలో విత్తనాల ఎంపికే కీలకం. దుక్కి దున్నింది మొదలుకొని పంట చేతికొచ్చే వరకు ప్రతీ చోట జాగ్రత్తలు పాటిస్తేనే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచిస్తున్నారు.

జిల్లాలో నకిలీ విత్తన విక్రయాలపై అధికారులు నిఘా పెంచారు. ప్రతీ గ్రామంలో విత్తన కొనుగోలు కేంద్రాల్లో అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం సైతం నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించింది. అయిన రైతుల అమాయకత్వాన్ని కొంతమంది సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు విత్తనాలు, ఎరువుల విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

ఎరువుల విషయంలో జాగ్రత్తలు

పంటల అధిక దిగుబడికి ఎరువులు ఎంతో మేలు చేస్తాయి. కానీ కొందరు దళారులు, వ్యాపారులు నాసిరకం ఎరువులు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారు. ఫలితంగా అమాయక రైతులు నష్టపోతున్నారు. ఈ మేరకు కొన్ని మెలకువలు పాటిస్తే నకిలీ ఎరువులను నివారించే అవకాశం ఉంది. ఎరువులను కూడా లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలి.బిల్లు తప్పనిసరి. డీలర్ బుక్‌లో రైతులు తప్పకుండా సంతకం చేయాలి.



హబ్సీపూర్‌లో నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

విత్తనాలు కొనుగోలు చేసే ముందు సూచనలు

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బస్తాలపై పేరు, గడువు తేదీ వివరాలు తప్పకుండా గమనించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రశీదు తప్పకుండా తీసుకోవాలి.
- రశీదుపై విత్తన రకం, గడువు తేదీ పేర్కొనేలా డీలర్ సంతకం తీసుకోవాలి. రైతు సంతకం కూడా ఉండేలా చూసుకోవాలి.
- విత్తనాలను కొనుగోలు చేసే ముందు వ్యవసాయ శాఖ అధికారి, శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవడం మంచిది.
- మార్కెట్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ధ్రువీకరించిన విత్తనాలు విక్రయిస్తారు. వీటిని కొనుగోలు చేసే సమయంలో బస్తాపై నీలి వర్ణం ట్యాగ్ ఉందో లేదో గమనించాలి.
- లేబుల్ విత్తనాలు కూడా మార్కెట్లో లభ్యమవుతున్నాయి. జిల్లాలో ఈ రకం విత్తనాలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. వీటిని కొనుగోలు చేసే ముందు విత్తన సంచిపై ఆకుపచ్చ ట్యాగ్ కట్టి ఉంటుంది. దీనిపై విత్తన ప్రమాణాలు ముద్రించి విక్రయిస్తారు. ఈ విత్తనాలను రైతులు కేవలం ఆయా కంపెనీ నమ్మకంపై మాత్రమే కొనుగోలు చేయాలి.
- బ్రీడర్ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తన సంచికి పసుపు రంగు ట్యాగ్ ఉందో లేదో గమనించాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రోహిణి కార్తె ప్రారంభమవడంతో రైతులు విత్తనాల కోసం దుకాణాలకు వెళ్తున్నారు. పలు విత్తన కంపెనీలు డీలర్లకు ఆఫర్లు ప్రకటిస్తాయి. ఆ ఆఫర్లతో డీలర్లు సైతం రైతులకు విత్తనాలను అంటగట్టే అవకాశం ఉంది. వారి మాటలు నమ్మి మోసపోవద్దు. ఫొటోలు, ఆఫర్లు చూపి కంపెనీలు రైతులను పట్టణాలకు తీసుకుపోవడం, గ్రామాల్లో తిరుగుతూ విత్తన ప్యాకెట్లను బుక్ చేసుకోవడం చేస్తుంటారు. వాటికి దూరంగా ఉండటం రైతులకు మంచిదని అధికారులు సూచిస్తున్నారు.



చిన్నకోడూరులో విత్తనాల దుకాణాలు తనిఖీ చేస్తున్న పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



జిల్లాలో ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారి లైసెన్స్‌ను రద్దు చేస్తాం. ఎక్కడైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే రైతులు వెంటనే దగ్గరలో ఉన్న వ్యవసాయాధికారికి సమాచారం అందించాలి. విత్తన ఎంపిక, నకిలీ విత్తనాల విషయంలో ఏఈఓల ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకబోతున్నాయి. జూన్‌లో పంటలు వేస్తే మంచిది.

– మల్లయ్య, జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు, ఏడీఏ, దుబ్బాక

అవగాహన అవసరం

విత్తనాలపై రైతులకు అవగాహన ఉండాలి. కొనుగోలు చేసిన ప్యాకెట్లలో ఉన్న విత్తనాలు ఎంత శాతం మొలకెత్తుతాయో చూసుకోవాలి. రశీదు, ప్యాకెట్లను భద్రపర్చుకోవాలి. అనుమతి ఉన్న డీలర్ల దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి.

– జయంత్ కుమార్, ఏఓ, చిన్నకోడూరు

నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం

విద్యుత్ వైర్లకు తాకుతున్నాయని చెట్ల నరికివేత



విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల నరికివేత

శివ్వంపేట(నర్సాపూర్): హరితహారంలో భాగంగా గతంలో నాటిన మొక్కలు గొడ్డలి పెట్టుకు గురవుతున్నాయి. మండల కేంద్రంలోని తూప్రాన్– నర్సాపూర్ హైవే పక్కన విద్యుత్ లైన్ కింద మొక్కలు నాటడం వల్ల ప్రస్తుతం అవి ఏపుగా పెరగడంతో తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. కొమ్మలు వైర్లకు తగులుతుండటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని సిబ్బంది వాటిని తొలగిస్తున్నారు. వైర్లను చూడకుండా మొక్కలు నాటడంతో ప్రయోజనం లేకుండా పోయిందని ప్రకృతి ప్రేమికులు పేర్కొంటున్నారు.

వర్షానికి కూలిన ఇంటి పైకప్పు



దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటలో శనివారం కురిసిన వర్షానికి జనగామ స్వామి ఇంటి పైకప్పు, గోడలు అర్ధరాత్రి సమయంలో కూలడంతో భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.